క్లుప్తంగా

ఓటరు స్లిప్‌ల పంపిణీ



మహమ్మదాబాద్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తిరుపతయ్య తెలిపారు. శని, ఆదివారాల్లో మండలవ్యాప్తంగా ఓటరు స్లిప్‌లను అందించారు. ఆర్‌ఐ యాదయ్య కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

భక్తిభావం ఎంతో గొప్పది



మహమ్మదాబాద్: భక్తిభావం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వెంకట్‌రెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న బీరప్ప జాతరలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డీసీసీబీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ, డీసీసీ ఉపాధ్యక్షుడు కమతం విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మహబూబ్‌నగర్ రూరల్: కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం కోటకదిరకి చెందిన మత్స్య సంఘం ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, సహాయ కార్యదర్శి చేపల రాములుతో పాటు పలువురు ఆ పార్టీ నాయకులు నర్సింహారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఉప సర్పంచ్ కురుమూర్తి, నాయకులు రాజశేఖర్, చేపల రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానివి కార్మిక వ్యతిరేక విధానాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించిందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములుయాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘంలో కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్లలో కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చిందని ఆరోపించారు. 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా తెచ్చి కార్మిక హక్కులను హరించారని తెలిపారు. రోజుకు రూ.178ల కనీస వేతనం నిర్ణయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికి కార్మిక వర్గానికి అన్యాయం చేయడమేనని అన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టారని, సంపదను సృష్టించే కార్మికులకు కన్నీళ్లే మిగిల్చారని విమర్శించారు. ఇంకోవైపు 8 గంటల పనిని 12 గంటలకు పెంచబోతున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే అమలుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓడించి, కాంగ్రెస్‌ను గెలిపించాలని కార్మికవర్గానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు షేక్ బాబుమియా పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో బంగారు పతకం

నారాయణపేట రూరల్: మిడిల్ అండ్ డిస్టెన్స్ చాంపియన్‌షిప్ అథ్లెటిక్స్ పోటీలో జిల్లా క్రీడాకారుడు బంగారు పతకం సాధించాడు. ఆదివారం సూర్యపేటలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్న అండర్ 14 బాయ్స్ 600మీటర్ల పరుగుపందెంలో బసంత్ చక్కటి ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా వందమీటర్ల బాలికల విభాగంలో శ్రీలత కాంస్యం సాధించింది. ఈమేరకు అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ రమణ, వైస్ ప్రెసిడెంట్ నందునామాజీ, ట్రెజరర్ అంబరీష్, డీవైఎస్‌ఓ వెంకటేష్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు అభినందించారు.

ఘనంగా ప్రతిష్ఠాపనోత్సవాలు



తాళ్లగడ్డలో ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

అడ్డాకుల: మూసాపేట మండలం తాళ్లగడ్డ గ్రామంలో ఆదివారం ఆంజనేయస్వామి, శివాలయం వద్ద విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. ఆంనేయస్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠ చేశారు. అదేవిధంగా శివాలయం వద్ద పండితులు ప్రత్యేక పూజలు చేసి శివలింగం, నందీశ్వరుడు, నవగ్రహాల ప్రతిష్ఠ చేశారు. తర్వాత శివాలయం ముందు కూడా ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ చేపట్టారు. సాయంత్రం గ్రామ దేవతకు బోనాలను సమర్పించి గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు.

కొండారెడ్డిపల్లిలో..

గండీడ్: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో ఎల్లమ్మ దేవత నూతన ఆలయం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం చివరిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాచాలలో..

అడ్డాకుల: రాచాలలోని రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. రెండు రోజుల నుంచి ఆలయం వద్ద ధ్వజస్తంభం, నవగ్రహాలు, గణపతి, నందీశ్వరుడి విగ్రహాలకు పండితులు పూజలు చేశారు. మూడో రోజు పండితులు ప్రత్యేక పూజల అనంతరం వాటిని ప్రతిష్ఠ చేశారు. ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌లు ఆలయానికి వచ్చి పూజలు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠ తర్వాత గ్రామస్తులు ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నేరెళ్లపల్లిలో..



బాలానగర్: నేరెళ్లపల్లిలో నూతన హనుమాన్ ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, బొడ్రాయి పండుగ కార్యక్రమాలు ఆదివారం కనుల పండువగా సాగాయి. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్ రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.

కొనగట్టుపల్లిలో..



హన్వాడ: మండల పరిధిలోని కొనగట్టుపల్లి గ్రామంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై పూజలు చేశారు. మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, జెడ్పీటీసీ విజయనిర్మల, నాయకులు రమణారెడ్డి, బసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

దేవరకద్ర రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం పేరూర్, కొకుంట్ల, జీన్గురాల, బస్వాయపల్లి, హాజీలాపూర్ గ్రామాల్లో ప్రచారంను నిర్వహించి మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ను గత ఎన్నికల్లో ప్రజలు ఎలాగైతే ఓడించారో, మతం, దేవుడి పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీని కూడా ఈ ఎన్నికల్లో ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, అంజిల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నాడు. ఆదివారం దమగ్నాపురంలో చిన్నవడ్డేమాన్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అప్పంపల్లి ప్రచారం నిర్వహించారు. కొకుంట్ల మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ఎస్‌ఏస్‌యూ నాయకుడు అక్బర్ పాల్గొన్నారు.

గ్యారంటీలను అమలు చేసి తీరుతాం



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

బాలానగర్: ఎన్నికల కోడ్ ముగియగానే మహిళలకు రూ. 2500, ఉచిత విద్యుత్, ఆగస్టు 15 లోపు రూ. రెండులక్షల రుణమాఫీ చేసి తీరుతామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. ఆదివారం మోతీఘనపూర్, గంగదారిపల్లి, మేడిగడ్డ తండా, కుంటలోపు తండా, సూరారం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని, మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిస్తే జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వంశీచందర్ రెడ్డి అన్నారు. నియోజవర్గానికి మూడు నెలల్లోనే రూ. 160 కోట్ల బీటీ రోడ్డులు తీసుకువచ్చానని, 3500 ఇండ్లు తీసుకువచ్చానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. పాలమూర్ జిల్లాకు చెందిన వ్యక్తి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఎంపీ అభ్యర్థిగా వంశీచందర్ రెడ్డి గెలిస్తే మహబూబ్‌నగర్ జిల్లాకు, ఆయా గ్రామాలకు మరిన్ని నిధులు తెస్తానని అన్నారు. వంశీచందర్‌రెడ్డి గెలిస్తే కేంద్రంలో మంత్రి అవుతారని అన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, 30వ వార్డు కోఆర్డినేటర్ ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. వార్డులో ఆదివారం బూత్‌స్థాయి సమావేశం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జీ సుదర్శన్, గడిగె శంకర్, శేఖర్, నిర్మల, నరేందర్, మహేష్, అనిల్, సాధిక్ హుస్సేన్, మహ్మద్ బురాన్, సోను తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: వచ్చే ఎంపీ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపుకోసం ప్రతీ కార్యకర్త నిరంతరం కృషి చేయాలని మహమ్మదాబాద్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ అన్నారు. ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతీబాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్‌రెడ్డి, రాధారెడ్డి, రాంలాల్, ముకుందం, పాల్గుణ ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత



బాలానగర్: మండల కేంద్రానికి చెందిన కళ్లెం పూజిత వివాహానికి గ్రామానికి చెందిన గుడిసెల యాదయ్య పుస్తెమెట్టెలు, 80 కేజీల బియ్యాన్ని సాయంగా అందించారు. బాలానగర్‌లో పలువురి పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆయన సాయం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు ఆయనను అభినందించారు. రవికుమార్, చక్రం, రాజు కటికె, మల్లేష్ తదితరులు ఉన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ ఆలయం చెంత ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాల మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో మైసమ్మ అడవి మొత్తం భక్తులతో నిండిపోయింది. కాగా పచ్చని చెట్ల కింద భక్తులు విందు చేసుకుని సేదతీరారు.

ఆత్మీయ సమ్మేళనం



నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం పూర్వవిద్యార్థుల (2003 – 2004) ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. రాజు, విష్ణు, గిరి, బాలు, శ్రీను, నర్సింహ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్‌పాఠశాల (2003–2004) పూర్వవిద్యార్థులు ఆదివారం సమావేశం అయ్యారు. 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువులను సత్కరించారు. ఇటీవలే డాక్టరేట్ సాధించిన అప్పటి పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా సన్మానించారు. జంగయ్య అనే ఉపాధ్యాయుడికి రూ.20వేలు అందజేశారు. 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డితోపాటు మిత్రబృందం పాల్గొన్నారు.

హాస్టల్ భవనం తొలగింపు



కొనసాగుతున్న కూల్చివేత పనులు

జడ్చర్ల టౌన్: జాతీయరహదారి (167వ నంబరు) రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొన్ని నిర్మాణాలు తొలగించారు. సిగ్నల్‌గడ్డ ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి డిగ్రీ కళాశాల మహిళా హాస్టల్ భవనం వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా నీళ్లట్యాంక్ వద్ద ఉన్న మత్స్య కార్మికుల షట్టర్లు నాలుగు ఇదివరకే కూల్చివేశారు. అందుకు గానూ వారికి రూ.20లక్షల పరిహారాన్ని అందించారు. ఆ పరిహారం డబ్బులు ప్రస్తుతం మున్సిపాలిటీలో ఉన్నాయి. ఇక్కడే లైట్‌మోటార్ వెహికల్ అసోసియేషన్ వారు నిర్మించుకున్న మైసమ్మ దేవాలయం తొలగించారు. ఆలయం పునఃనిర్మాణం కోసం రూ.2లక్షలు జాతీయరహదారుల శాఖ నుంచి విడుదల అయ్యాయి. హాస్టల్ భవనం ప్రహరీని ఇదివరకే తొలగించగా భవనాన్ని కూల్చివేసే పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సగం భవనాన్ని తొలగించారు. హాస్టల్ భవనం తొలగించేందుకు గాను పరిహారంగా రూ.1కోటి మంజూరు అయ్యాయి. పక్కనే ఉన్న బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రహరీ తొలగించాల్సి రావటం వల్ల వారికి రూ.30లక్షల పరిహారం అందించారు. అదేవిధంగా కొందరు ప్రైవేట్ వ్యక్తులకు సైతం రూ.10లక్షల వరకు పరిహారం మంజూరు అయ్యింది. తహశీల్దార్ కార్యాలయం ప్రహరీ తొలగించాల్సి రావటం వల్ల పరిహారం అందాల్సి ఉంది.

పోటీలు నైపుణ్యాన్ని వెలికితీస్తాయి



బహుమతి అందజేస్తున్న భాగన్నగౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: చిత్రలేఖన పోటీలు విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీస్తాయని స్వరలహరి కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు భాగన్నగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అకాడమీ కార్యాలయంలో ఆదివారం ప్రముఖ భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ జయంతిని పురస్కరించుకొని స్ఫూర్తి సామాజిక సేవ, యువజన కళా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ప్రముఖ కవి రంగినేని మన్మోహన్ మాట్లాడుతూ కళలు నేర్చుకోవడం వల్ల విద్యార్థులలో క్రమశిక్షణ, జీవన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. హార్మోనియం కళాకారుడు వేణుగోపాలాచారి, అకాడమీ డైరెక్టర్లు మేకల శ్రీనివాస్, డీకే.ఆంజనేయులు, సంస్థ సభ్యుడు జమాల్పూర్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న బీఆర్‌ఎస్, బీజేపీ



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రోజు రోజుకు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు కనుమరుగవుతున్నాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం పట్టణంలోని 2, 22, 33, 46 వార్డుల బీఆర్‌ఎస్ కార్యకర్తలు, బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి వెంకటేశ్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు రాణి, ముడా డైరెక్టర్ మిర్యాల వేణుగోపాల్, ఆర్యవైశ్య నాయకులు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు బెక్కరి మధుసూదన్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, అవేజ్ అహ్మద్, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ కౌన్సిలర్ మహమూద్‌అలీ, మున్సిపల్ కోఆప్టడ్ మెంబర్ అర్షద్ అలీ ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి

ఎన్టీఆర్ శతజయంతి స్మారకార్థం రూ.100 కరెన్సీని ఆర్‌బీఐ ముద్రించింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌తో కలిసి కరెన్సీని ఆవిష్కరించారు. ఎన్టీఆర్‌కు ఇది నిజమైన నివాళి అని అన్నారు. టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటయ్య, మురళి, యాదయ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: పేదల కోసం పుట్టిందే కాంగ్రెస్ పార్టీ అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెంకటమ్మకుంటతండా, దాచక్‌పల్లి, దయ్యాలమర్రితండా, గుడ్డిమల్కాపూర్, టంకర, రాంనాయక్‌తండాల్లో పర్యటించారు. దాచక్‌పల్లి మాజీ సర్పంచ్ బాలకిష్టారెడ్డి పార్టీలో చేరారు. సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న చెన్న వీరయ్య

మహబూబ్‌నగర్ క్రీడలు: వేసవి కరాటే శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా వైస్ చైర్మన్ చెన్న వీరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కింగ్‌షోటోకాన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 2వ తేదీన స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో ఉదయం 8 గంటలకు 26వ వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అదే విధంగా 3న షాసాబ్‌గుట్టలోని అల్‌నూర్ స్కూల్‌లో కూడా వేసవి కరాటే శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ జూన్ 2వ వరకు వేసవి ఉచిత కరాటే శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు శిబిరాలు ఉంటాయని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు 9849301171 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ చైర్మన్ లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్, కోశాధికారి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ అభివృద్ధి



పెద్దరేవల్లిలో ప్రచారం చేస్తున్న డీకే అరుణ

బాలానగర్: పదేళ్ల పాలనలో దేశాన్ని బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందని.. ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. ఆదివారం పెద్దరేవల్లి, బాలానగర్, మోతీఘనపూర్, సూరారం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో రానున్నది మోదీ ప్రభుత్వమేనన్నారు. కమలం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు ఓటు ఎందుకు వేయాలో ఆ పార్టీ నాయకులు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా పలువరులు పార్టీలో చేరారు. రాష్ట్ర నాయకురాలు బాలా త్రిపురా సుందరీ దేవి, రాబోతుల శ్రీనివాస్ గౌడ్, బాలవర్ధన్ గౌడ్, సాటి శ్రీనివాస్ యాదవ్, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: ధర్మానికి అబద్ధానికి మధ్య జరుగుతున్న యుద్ధమే పార్లమెంట్ ఎన్నికలని డీకే అరుణ అన్నారు. ఆదివారం మండలంలో కొల్లూర్, నవాబుపేట, ఇప్పటూర్, కారుకొండ గ్రామాల్లో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ధర్మం వైపు బీజేపీ ఉంటే అబద్ధాల పునాదులతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. దేశం సురక్షితంగా ఉందని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తున్న తరుణంలో మోదీని అడ్డుకుని దేశాన్ని అస్థిరపర్చాలని కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందన్నారు. వారి అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజు తదితరులు ఉన్నారు.

దేవరకద్ర రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో డీకే అరుణను గెలిపించాలని పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ అన్నారు. ఆదివారం డోకూర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఓటు అభ్యర్థించారు. రాష్ట్ర నాయకులు యజ్ఞభూపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ రెడ్డి, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

సత్తాచాటిన గురుకులాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని గురుకుల కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఇందులో ఎస్సీ గురుకుల కళాశాలలకు సంబంధించి మొదటి సంవత్సరంలో జిల్లాల వారీగా గద్వాలలో 72.21 శాతం ఉత్తీర్ణత సాధించారు. వనపర్తిలో 72.21, నాగర్‌కర్నూల్‌లో 73.4, మహబూబ్‌నగర్‌లో 80.89 శాతం, నారాయణపేటలో 77.92 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. రెండో సంవత్సరంలో వనపర్తి 83.28 శాతం, నాగర్ కర్నూల్ 81 శాతం, మహబూబ్‌నగర్ 91 శాతం, గద్వాల 76.1, నారాయణపేట 82.3 శాతం నమోదైంది.

- ఎస్టీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 71.43 శాతం, వపపర్తి 95.38, మహబూబ్‌నగర్ 73.02, నాగర్‌కర్నూల్ 72.09, నారాయణపేట 71.63 శాతం సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో గద్వాల 84.21, వనపర్తి 94.67, నాగర్‌కర్నూల్ 85.85, మహబూబ్‌నగర్ 83.33, నారాయణపేట 91.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- టీఎస్‌ఆర్‌జేసీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 89.33, మహబూబ్‌నగర్ 97.53, రెండో సంవత్సరంలో గద్వాల 92.65, మహబూబ్‌నగర్ 98.8 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్‌లో కళాశాలలు లేవు.
- మోడల్ స్కూళ్లలో మొదటి సంవత్సరం వనపర్తిలో 50.17, నాగర్‌కర్నూల్‌లో 38.07, మహబూబ్‌నగర్‌లో 50, నారాయణపేటలో 47.2 శాతం ఉంది. రెండో సంవత్సరంలో వనపర్తిలో 69.6, నాగర్‌కర్నూల్‌లో 55.34, మహబూబ్‌నగర్‌లో 69.6, నారాయణపేటలో 46.86 శాతం ఉత్తీర్ణత సాధించగా గద్వాలలో కళాశాల లేదు.
- కేజీబీవీల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 73.84, వనపర్తిలో 74.2, నాగర్‌కర్నూల్‌లో 63.77, మహబూబ్‌నగర్‌లో 76.45, నారాయణపేటలో 72.59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరంలో గద్వాలలో 83.9, వనపర్తి 83.3, నాగర్‌కర్నూల్ 75.58, మహబూబ్‌నగర్‌లో 85.84, నారాయణపేటలో 76.29 శాతం ఉత్తీర్ణత వచ్చింది.
- మైనార్టీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 83.87, వనపర్తిలో 73.21, నాగర్‌కర్నూల్‌లో 60.32, మహబూబ్‌నగర్‌లో 73.57, నారాయణపేటలో 75 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. రెండో సంవత్సరంలో గద్వాల 88.7, వనపర్తిలో 82.86, నాగర్‌కర్నూల్‌లో 85.25, మహబూబ్‌నగర్‌లో 86.6, నారాయణపేటలో 87.78 శాతం ఉత్తీర్ణత వచ్చింది.
- ప్రభుత్వ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 47.65 శాతం, వనపర్తిలో 35.68, నాగర్‌కర్నూల్‌లో 34.35, మహబూబ్‌నగర్‌లో 42.08, నారాయణపేటలో అత్యల్పంగా 29.61 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక రెండో సంవత్సరంలో గద్వాల 59.96, వనపర్తి 51.4, నాగర్‌కర్నూల్‌లో 49.8, మహబూబ్‌నగర్‌లో 50.94, నారాయణపేట 41.23 శాతం నమోదు చేశారు.
- బీసీ గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో గద్వాల 88.35 శాతం, వనపర్తి 77.6, నాగర్‌కర్నూల్ 74.73, మహబూబ్‌నగర్ 72.44, నారాయణపేట 64.41 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. రెండో సంవత్సరంలో గద్వాలలో 93.44, వనపర్తిలో 84.97, నాగర్‌కర్నూల్‌లో 88.39, మహబూబ్‌నగర్‌లో 91.8, నారాయణపేటలో అత్యధికంగా 96 శాతం నమోదైంది.